సాక్షి
ఖమ్మం

మంగళవారం | 27 | జూన్ | 2023



జలవిద్యుత్‌కు గ్రీన్‌సిగ్నల్?

సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను జెన్‌కో సీఎండీ సందర్శించగా జల విద్యుత్ ప్రాజెక్టు కేంద్రం ఏర్పాటుపై చర్చ మొదలైంది. 10లో



మాదకద్రవ్యాల నిర్మూలనకు..

మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని వివిధ శాఖల అధికారులు సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 25°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.56లక్షలు



నగదు లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా 102 రోజులకు గాను రూ.56,06,274 ఆదాయం నమోదైంది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రెంటాల సమత ఆధ్వర్యాన చేపట్టిన లెక్కింపులో ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస శర్మ, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో సమస్యల పరిష్కారం



సమస్యలు వింటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించారు. కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించిన సీపీ.. పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

నేడు 'నిధి ఆప్ కే' నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం 'నిధి అప్ కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ సమస్యలను భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తెలిపి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు మధిర మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో, భద్రాద్రి జిల్లా వాసులు మణుగూరులోని మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

తొలిరోజు 'రైతుబంధు' రూ.36.90 కోట్లు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం రైతుబంధు పథకం సోమవారం ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రకటించినట్లుగా తొలిరోజు ఎకరం మేర భూవిస్తీర్ణం కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఎకరాకు రూ.5 వేల చొప్పున జిల్లాలో 1,18,126 మంది రైతుల ఖాతాల్లో రూ.36.90 కోట్లు జమ అయ్యాయి. ఇక మంగళవారం రెండెకరాల మేర భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందే అవకాశముంది. జిల్లాలో 3,32,893 మంది అర్హులు ఉండగా, ఈనెల 18 నాటికి నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన మరో 15,969 మందికి రైతు బంధు సాయం అందుతుంది. అయితే, కొత్త రైతులు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డును ఏఈఓలకు సమర్పిస్తే రైతుబంధు పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తారు.

జూలై 15 వరకు అపరాల సాగు

మధిర: అపరాల పంటలను జూలై 15వరకు విత్తుకోవచ్చునని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణి దేవి వెల్లడించారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యమైనందున, వచ్చే నెల 15వ తేదీ వరకు అపరాల విత్తనాలను విత్తినా ఇబ్బంది ఉండదని తెలిపారు. అలాగే, కంది పంటను మొక్కల సాంద్రత పెంచి ఆగస్టు 15 వరకు కూడా విత్తుకోవచ్చని చెప్పారు. కంది పంటను పత్తి, మొక్కజొన్న పంటల్లో అంతర పంటగా 1:4 లేదా 1:6 నిష్పత్తిలో సాగు చేయొచ్చని, పెసర, మినుము పంటల్లో 1:2 నిష్పత్తిలో, పత్తిలో 1:7 నిష్పత్తిలో నాటాలని సూచించారు. మిర్చి పంట సాగుకు ముందు పెసర వేసి కలియదున్నితే భూసారం పెరగడంతో పాటు బీడపీడల పెడద తగ్గుతుందని తెలిపారు. కాగా, డబ్ల్యూజీఎల్ 962 స్వల్పకాలిక వరి విత్తనాలు పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి, ఎంటమాలజీ శాస్త్రవేత్త కొత్తపల్లి నాగస్వాతి ఓ సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

ముహూర్తం కుదిరింది!



ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో కరచాలనం చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి.. పక్కన ఆయన తనయుడు హర్షారెడ్డి, బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, పాయం వెంకటేశ్వర్లు, జూపల్లి, దొడ్డా నగేష్, ఆదినారాయణ

కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఢిల్లీలో ప్రకటించిన పొంగులేటి

- వచ్చే నెల 2న ఖమ్మంలో బహిరంగ సభ
- రాహుల్‌గాంధీ సమక్షాన చేరికలు
- ఏఐసీసీ అగ్రనేతలతో సభపై చర్చించిన మాజీ ఎంపీ



మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీని సన్మానిస్తున్న పొంగులేటి, రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సుమారు ఆరు నెలలుగా సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎపిసోడ్ ఓ కొలిక్కి వచ్చింది. ఆయన తన అనుచరవర్గంతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఢిల్లీ వేదికగా ప్రకటించారు. వచ్చేనెల 2న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో తన మద్దతుదారులతో కలిసి రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకుంటామని వెల్లడించారు. హస్తినలో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని సోమవారం ఆయన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతోపాటు కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు.

2014లో ఎంపీగా గెలిచి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2014 ఎన్నికల్లో తాను ఎంపీగా గెలవడంతోపాటు సీపీఎం మద్దతుతో వైరా, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక వైఎస్సార్‌సీపీ మద్దతుతో భద్రాచలం నియోజకవర్గాన్ని కూడా సీపీఎం దక్కించుకుంది. ఆ తర్వాత పరిణామాల నేపథ్యాన ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అయితే పార్టీలో అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో అసంతృప్తికి లోనవుతూ వచ్చారు. 2019లో పార్లమెంట్ ఎన్నికల సమయంలో అప్పటికే ఎంపీగా ఉన్న పొంగులేటికి టికెట్ దక్కలేదు. ఆతర్వాత రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు వస్తాయనే ప్రచారం జరిగినా అవీ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో కొనసాగారు.

రాహుల్‌కు నేతల పరిచయం

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పొంగులేటి వెంట పలువురు నేతలు ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమావేశం అనంతరం పొంగులేటి.. జిల్లా నేతలను రాహుల్‌గాంధీకి పరిచయం చేశారు. ఆ తర్వాత మాజీ మంత్రి జూపల్లితో కలిసి ప్రియాంక గాంధీతో సమావేశమయ్యారు. పొంగులేటి వెంట వెళ్లిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నేతలు మువ్వా విజయ్‌బాబు, తెల్లం వెంకట్రావు, పిడమర్తి రవి, జారె ఆదినారాయణ, బానోతు విజయాబాయి, తుళ్లూరి బ్రహ్మయ్య, తుంబూరి దయాకర్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, నూతకాని జైపాల్, రామసహాయం నరేష్‌రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, ఊకంటి గోపాలరావు, డాక్టర్ రాజారమేష్, జూపల్లి రమేష్, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

2న ఖమ్మంలో సభ..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన బృందంతో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులతో సోమవారం సమావేశమయ్యాక విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్‌లో చేరతామని, ఈ సభకు రాహుల్‌గాంధీ హాజరవుతారని తెలిపారు. ఆ దిశగా భారీ సభ నిర్వహణకు ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్ వెనుక పొంగులేటి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లు మొదలుపెట్టగా, సభ విజయవంతం, జనసమీకరణ కోసం ఇప్పటికే నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ ఏడాది జనవరి 18న నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను తలదన్నేలా తమ సభ ఉంటుందని పొంగులేటి చెబుతున్నారు. రాష్ట్రస్థాయిలో చేరికల పరంగా ఇదే భారీ సభ కానుండటంతో పొంగులేటితో పాటు ఇతర జిల్లాల నేతలు కూడా ఈ సభలోనే కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

చివరకు 'చేయి' అందుకుని..

దాదాపు నాలుగేళ్ల అనంతరం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది జనవరి 1న ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఆత్మీయుల సమావేశంలో తన అసంతృప్తిని బయటపెట్టారు. అయితే, ఈ సమావేశంలో అసంతృప్తిని మాత్రమే వ్యక్తం చేయగా, నియోజకవర్గాల వారీ ఆత్మీయ సమావేశాల్లో మాత్రం సీఎం కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు ఎక్కుపెట్టారు. తనకు కనీస గౌరవం ఇవ్వలేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో పొంగులేటి బీజేపీ లేదా కాంగ్రెస్‌లో చేరతారని.. లేదంటే కొత్త పార్టీ పెడతారని ప్రచారం సాగింది. ఇంతలోనే సర్వేలు చేయించుకున్న ఆయన, అనుచరగణం ముక్తకంఠంతో చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరికకు నిర్ణయించుకున్నారు.

గ్రీవెన్స్ డేకు పోటెత్తారు...





గ్రీవెన్స్‌లో బారులుదీరిన ప్రజలు (ఇన్‌సెట్) ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

- ఫిర్యాదులకు బారులు దీరిన జనం
- వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గత రెండు వారాలు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేశారు. తిరిగి ఈ వారం మొదలుకావడంతో జిల్లా నలుమూలల నుంచి జనం పోటెత్తారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను కలెక్టర్ గౌతమ్ స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

ఏన్కూరు మండలం అన్నారుగూడెంకు చెందిన మట్టా వెంకటేశ్వర్లు దివ్యాంగుల పింఛన్, రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన బి.రమణ వితంతు పెన్షన్ మంజూరు చేయాలని, ఎర్రుపాలెంకు చెందిన షేక్ జిలానీకు గుండె ఆపరేషన్ అయిందని ఆసరా పింఛన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే, మరికొందరు రెవెన్యూ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు అందజేశారు. అదనపు కలెక్టర్ స్నేహలత, డీఆర్వో శిరీష, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయండి

రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న లక్ష్యాలను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుండి సోమవారం ఆమె జీఓలు 58, 59 అమలు, పట్టాల పంపిణీపై కలెక్టర్లతో సమీక్షించారు. జీఓ 58 కింద పట్టాల పంపిణీ పూర్తి చేయాలని, జీఓ 59 ద్వారా నిర్ణీత రుసుము చెల్లించేలా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో జీఓ 59 ద్వారా 2,559 దరఖాస్తులు అందగా, దరఖాస్తుదారులను కలిసి ఫీజు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. వీసీలో కల్లూరు ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్లు శ్రీనివాసరావు, శైలజ పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తుల కు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

వైభవంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు, సంస్థ ప్రతినిధులు

'ఇస్కాన్' ఆధ్వర్యాన తొలిసారిగా నిర్వహణ

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలో సోమవారం జగన్నాథుడి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై జగన్నాథ స్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిని ప్రతిష్ఠించి హరేరామ, హరేకృష్ణ నామార్చనలతో ఊరేగింపు చేపట్టారు. ఇస్కాన్ ఆధ్వర్యాన తొలిసారి చేపట్టిన జగన్నాథ యాత్ర త్రీటౌన్‌లోని వర్తక సంఘం భవనం వద్ద ప్రారంభమై గాంధీచౌక్, పొట్టి శ్రీరాములు రోడ్, శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం, కాల్వొడ్డు, పాతబస్‌స్టాండ్, వైరారోడ్ మీదుగా నాగార్జున ఫంక్షన్ హాల్‌కు చేరింది. ఈసందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథానికి స్వాగతం పలకారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి, విజయవాడకు చెందిన ఇస్కాన్ ప్రతినిధులు విష్ణుస్వామి దాస్, జీవదాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావుతో పాటు కడవెండి వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్ షట్టర్ల తనిఖీ



రిజర్వాయర్ షట్టర్లను పరిశీలిస్తున్న నిపుణుల బృందం, ఇంజనీర్లు

ఖమ్మంఅర్బన్: కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ గాడ్‌బోల్ గేట్(షట్టర్లు)ను పూణేకు చెందిన ఇంజనీరింగ్ కంపెనీ బృందం సోమవారం సందర్శించింది. అలుగుపై ఉన్న ఆటోమెటిక్ షట్టర్లను రూ.22 లక్షల వ్యయంతో మరమ్మతు చేయిస్తున్నారు. ఈ నేపథ్యాన మరమ్మతు పనులను నిపుణులైన పూణేలోని డాల్‌పాల్ కంపెనీ ఇంజనీర్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. 2007లో సాగర్ కాల్వల ఆధునికీకరణ సమయాన షట్టర్ల మరమ్మతు చేయగా, మళ్లీ ఇప్పుడు చేపట్టారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో 23 అడుగుల మేర నీరు నిండితే అలుగుపై ఉన్న గేట్లు వాటికవే కిందకు దిగేలా ఏర్పాటుచేశారు. వీటిని ఎప్పటికప్పుడు జిల్లా జల వనరుల శాఖ అధికారులు పర్యవేక్షిస్తుండగా.. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టడంతో నిపుణులను పిలిపించారు. ఈ పరిశీలనలో జల వనరుల శాఖ ఈఈ ఎం.వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, పూణే బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లు.. ఎదురు చూపులు?!

- విడుదల కాని బీఏఎస్ మార్గదర్శకాలు
- విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు వారాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

ఖమ్మంమయూరిసెంటర్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోంది. ఇందులో భాగంగా సంక్షేమ శాఖల ద్వారా ఉచిత వసతి కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించడం, గురుకులాల్లో వసతి, విద్య అందిస్తున్నారు. వీటితో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకునేందుకు బెస్ట్ అవైలబుల్ పథకం(బీఏఎస్) ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఏటా 99 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత వసతితో చదువుకునేలా ఎంపిక చేస్తూ నిధులను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి బీఏఎస్ కింద విద్యార్థుల ఎంపిక పూర్తి చేసేవారు. కానీ ఈసారి బడులు తెరిచి రెండు వారాలు గడుస్తున్నా మార్గదర్శకాలు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

విడుదల కాని నోటిఫికేషన్

బీఏఎస్ పథకం కింద పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తారు. ఏటా మే నెలలోనే దరఖాస్తులు ఆహ్వానించి, మే నెల చివరి వారం కల్లా విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తుంటారు. కానీ ఈసారి ఇప్పటివరకు నోటిఫికేషన్ రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాఠశాలల్లో బోధన ఆరంభమైనందున ఇప్పుడు చేర్పించలేకపోతే పిల్లలు చదువులో వెనకబడతారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

1, 5వ తరగతుల్లో ప్రవేశాలు

బీఏఎస్ ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు పొందేందుకు రెండు తరగతుల విద్యార్థులకే ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఒకటో తరగతిలో డే స్కాలర్‌గా, 50 మందికి సీట్లు కేటాయిస్తారు. ఇక 5వ తరగతిలో రెసిడెన్షియల్ విధానంలో 49 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. అయితే, ఈసారి సీట్లు మరిన్ని పెంచడంతో పాటు బీఏఎస్ నోటిఫికేషన్ సత్వరమే విడుదల చేసి ప్రవేశాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రారంభమైన పఠనోత్సవం



రిక్కాబజార్ పాఠశాలలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచేందుకు ప్రతీ సోమవారం పఠనోత్సవం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యాన సోమవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రిక్కాబజార్ పాఠశాల హెచ్‌ఎం కనపర్తి వెంకటేశ్వర్లు తదితరులు అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

ఏలూరికి ఘన సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఏలూరి శ్రీనివాసరావు విశిష్టసేవలు అందించారని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కొనియాడారు. ఈడీగా విధులు నిర్వర్తిస్తూ మాతృశాఖకు వెళ్తున్న శ్రీనివాసరావును సోమవారం రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ ఆయనను సన్మానించి మాట్లాడుతూ జిల్లాలో దళితబంధు పథక విజయవంతంతో పాటు జీలో 58, 59 దరఖాస్తుల పరిశీలన, గొర్రెల యూనిట్ల సేకరణలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, జెడ్పీ సీఈఓ వీ.వీ. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



విద్యార్థినులను సన్మానిస్తున్న డీఈఓ శర్మ, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని డీఈఓ సోమేశ్వరశర్మ తెలిపారు. గత విద్యాసంవత్సరం ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈకార్యక్రమంలో డీఈఓ ముఖ్యఅతిధిగా మాట్లాడుతూ విద్యార్థులు నచ్చిన రంగాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌తో పాటు ఎం.డీ.జాఫర్ మతిన్, అబాద్ అలీ, అబ్దుల్ ముజిబ్, అబ్దుల్ మాలిక్, హప్స, మహావీస్, ఫరీస్, సాదియా, సుమయ్య, సిరాజ్, కుబ్రా, నాజినీస్, అకీయా, హనీఫా, మహేరా పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్ పైలాన్ పనులు పరిశీలన

ఖమ్మంరూరల్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించనున్న సందర్భంగా మండలంలోని పొన్నేకల్‌లో పైలాన్ నిర్మిస్తున్నారు. ఈమేరకు పనులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఖమ్మంలో బహిరంగ సభ జరగనున్న రోజు పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

బావిలో పడి చుక్కల దుప్పి మృతి

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం అటవీ ప్రాంతం నుంచి జనవాసాల్లో వచ్చిన ఓ చుక్కల దుప్పి ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందింది. కిష్టారం అటవీ ప్రాంతంలో సింగరేణి ఓసీల్లో జరుగుతున్న బాంబు పేలుళ్లకు బెదిరిన దుప్పి మూడు రోజుల క్రితం బయటకు వచ్చింది. పట్టణంలోని వెంగళరావునగర్-1వ వీధిలో ఎవరూ నివాసం ఉండని ఇంటి ఆవరణలోకి వచ్చిన దుప్పి బావిలో పడి మృతి చెందింది. అయితే, సోమవారం బావి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు చేరకుని దుప్పి మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం వెటర్నరీ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

రూ.కోటికి దివాలా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.1,09,04,370కు గాను సోమవారం దివాలా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన కాటపల్లి సురేష్ పలువురి అప్పులు తీసుకున్నాడు. ఆతర్వాత చెల్లించలేని పరిస్థితి ఎదురైందని చెబుతూ 31 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,800	1,780
పెసలు	7,250	5,400
కందులు	8,700	8,500
మిర్చి	20,000	13,500
ఏసీ మిరి	24,500	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	6,700	4,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

మాదక ద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగించాలి

- జిల్లా సంక్షేమాధికారి జ్యోతి
- జిల్లా కేంద్రంలో యువతతో కలిసి భారీ ర్యాలీ



ఖమ్మంలో ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత, విద్యార్థులు



మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: మాదక ద్రవ్యాల నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి జి.జ్యోతి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి, జిల్లా డ్రగ్స్ అధికారి ప్రసాద్, డీఐఈఓ రవిబాబు, డీవైఎస్ఓ పరంధామరెడ్డి, డాక్టర్ జంగాల సునీల్‌కుమార్‌తో ర్యాలీని జ్యోతి ప్రారంభించారు. అనంతరం స్టేడియం, ఇల్లెందు క్రాస్ రోడ్, వైరారోడ్, మమత హాస్పటల్ మీదుగా లకారం ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సంక్షేమాధికారి జ్యోతి మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే అనర్థాలే తప్ప లాభం ఉండదని చెప్పారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలతో ఎదురయ్యే అనారోగ్యాన్ని డాక్టర్ సునీల్‌కుమార్, చట్టాలపై పోలీసు అధికారులు వివరించారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణపై రూపొందించిన పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు.

అందరూ పోరాడాలి



మధిర : సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి జావేద్‌పాషా

మధిర/ఖమ్మం లీగల్: మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా సూచించారు. మండలంలోని జిలుగుమాడులోని షేర్ చేయూత మత్తు పదార్థాల పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన లేక పలువురు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్ మత్తు పదార్థాలు అమ్ముతున్న, సేవిస్తున్న వారి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. షేర్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడగా, న్యూరో సర్జన్ డాక్టర్ ప్రాణహిత్‌రెడ్డి, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఎక్సైజ్ ఎస్సైలు శార్వాణి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం పుట్టకోటలోని వీధిబాలల పాఠశాలలో ఏర్పాటుచేసిన సదస్సులో కూడా జావేద్ పాషా మాట్లాడారు. జిల్లా చైల్డ్ లైన్ సమన్వయకర్త కె.శ్రీనివాస్‌తో పాటు ఎం.హన్మంతరావు, ఎం.వలరాజు, టి.శ్రీను, విరిత తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీపై ఆరా

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన నోడల్ అధికారి(డిప్యూటీ సీఈఓ) ఏ.వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని వివిధ పార్టీల నాయకుల సమక్షాన చేపడుతున్న తనిఖీ, జెడ్పీ ఆవరణలోని ఈవీఎం గోదాంలను సందర్శించిన ఆయన వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే, ఈవీఎంల తనిఖీని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కూడా పరిశీలించారు. భద్రత, బారికేడ్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, ఏసీపీ వై.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటిండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న నోడల్ అధికారి వెంకటేశ్వరరావు



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఆధీకృత షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

వైరారూరల్: లైసెన్సు కలిగిన ఆధీకృత డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మండలంలోని తాటిపూడిలో ఫెర్టిలైజర్ దుకాణాన్ని సోమవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణదారులు రైతులకు నాణమైన, మేలైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ తీసుకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు కూడా ప్రతీ కొనుగోలుపై రశీదు తీసుకుని భద్రపర్చుకోవాలని డీఏఓ చెప్పారు. ఏడీఏ బాబురావు, ఏఓ ఎస్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ కార్యాలయంలో చోరీ

కల్లూరు: కల్లూరులోని భారత్ గ్యాస్ కార్యాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌గా ఏడేళ్ల నుంచి బానోత్ రామారావు కొనసాగుతున్నారు. ఈమేరకు ఆదివారం తెల్లవారుజామున కార్యాలయం వెనక తలుపులు పగులకొట్టి లోనకు ప్రవేశించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. కార్యాయం బీరువా, కౌంటర్‌లో ఉన్న రూ.22 వేల నగదుతో పాటు ఏటీఎం, పాన్, ఆధార్‌కార్డులు, సీసీ కెమెరా, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు కూడా ఎత్తుకెళ్లారు. ఈమేరకు ఫిర్యాదు అందుకున్న ఎస్‌ఐ పి.రఘు, సిబ్బందితో కలిసి పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

బస్సులో గొలుసు మాయం

నేలకొండపల్లి: ఆర్‌టీసీ బస్సులో రద్దీ ఉండటంతో ఆగంతకుడు చాకచాక్యంగా బంగారం గొలుసు చోరీ చేశాడు. సూర్యాపేట జిల్లా యర్రారానికి చెందిన వి.అనిల్ సోమవారం రాత్రి ఖమ్మంలో బంగారం చైన్ కొనుగోలు చేయగా కోదాడ వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. ఖమ్మం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే జేబులో బంగారం చైన్ బాక్స్ కనిపించకపోవడంతో కండక్టర్‌కు చెప్పగా ముదిగొండ పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు ఆపారు. అయితే, ప్రయాణికులు ఒత్తిడి చేయడంతో తనిఖీ చేయకుండానే బయలుదేరారు. ఈమేరకు అనిల్ ముదిగొండ పోలీసు సిబ్బంది ద్వారా నేలకొండపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక పోలీసులు బస్సులో తనిఖీ చేసినా ఫలితం కనిపించలేదు.

సమస్యల పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగులు, సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: రిటైర్డు ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య, సుబ్బయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్డులు, నూతన పీఆర్సీ కమిటీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పరిష్కారంపై ఇకనైనా దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో డీ.కే. శర్మ, వేణు, వీరయ్య, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, కృష్ణమూర్తి, మారంరాజు రాధాకృష్ణారావు, కె.హన్మంతరావు, బాబురావు, రమేష్, బస్వారావు, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, విక్టోరియా, ఖాజా మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం అపహరించిన మహిళల అరెస్టు

మెదక్ మున్సిపాలిటీ: బంగారం, ఆభరణాలు అపహరించిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మెదక్ పట్టణ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 9వ తేదీన మెదక్ పట్టణంలోని మెహతాబ్ బంగారు దుకాణంలో నలుగురు మహిళలు 30 గ్రాముల బంగారు బిస్కెట్, నాలుగు జతల కమ్మలు అపహరించారు. దుకాణ యజమాని షకీల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా ఖమ్మం జిల్లా మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన బాలసాని వెంకటరామమ్మ, బొజ్జని నాగేంద్రమ్మ, బొజ్జని దీనమ్మ, నల్లబొట్ల వెంకటమ్మను నిందితులుగా గుర్తించి సోమవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ లింగం, సిబ్బంది సాయిబాబాగౌడ్, శివరాజ్‌గౌడ్, గంగరాజు, రవి, రాజును సీఐ అభినందించారు.

కొలిక్కి రాని షాదీఖానా స్థలవివాదం



వాగ్వాదానికి దిగిన అటవీశాఖ ఉద్యోగులు, ముస్లిం కమిటీ సభ్యులు

కల్లూరు: మండల కేంద్రంలో షాదీఖానా నిర్మాణ స్థలంపై వివాదం ఎటూ తేలడంలేదు. ఇటీవల రూ.75 లక్షలతో షాదీఖానా నిర్మాణ పనులు మొదలుపెట్టగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఆతర్వాత ప్రజాప్రతినిధుల సూచనలతో పనులు ప్రారంభించారు. కానీ సోమవారం అటవీశాఖ అధికారులు మళ్లీ పనులను అడ్డుకోగా ముస్లింమ్ కమిటీ సభ్యులతో వాదన జరిగింది. తల్లాడ ఎఫ్ఆర్ఓ కె.అరవింద్ మాట్లాడుతూ ఆర్ఐ పంచనామాలో సర్వే నంబర్ 19లో గ్రామ కంఠంగా చెబుతున్నా ఆ సర్వే నంబర్ లోకేషన్ మరోచోట చూపిస్తోందని తెలిపారు. పైగా షాదీఖానాకు భూమి కేటాయించినట్లు తమకు లేఖ రాకపోవడంతోనే పనులు అడ్డుకుంటున్నామని తెలిపారు. రైతు సమితి జిల్లా కమిటీ సభ్యుడు పసుమర్తి చందర్‌రావు, ముస్లింమ్ కమిటీ సభ్యులు సయ్యద్ అలీ, ఎస్.కే.కమ్లి, ఎం.డీ.ఇస్మాయిల్, జానీ, సయ్యద్ ఇషాక్ మాట్లాడుతూ ఈ భూమి పూర్వం హలీమియా, హకీమ్‌మియా ఆధీనంలో ఉండగా వారు పాకిస్తాన్ వెళ్లిపోవడంతో గ్రామ కంఠంగా ఉందని స్పష్టం చేశారు. కేవలం అటవీశాఖకు వాడుకునేందుకు మాత్రమే భూమి ఇవ్వగా, తహసీల్దార్ పంచనామా చేసి తమకు స్వాధీనం చేశారని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పి.రఘు చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకో వాలని సూచించారు. డీఆర్ఓ ఎ.నాగమణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎం.డీ.అజామ్ అలీ, పి.కోషోర్, బీమా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండాకు చెందిన బానోత్ బాస్కర్(35) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మీరా బాలకృష్ణతో భాస్కర్‌కు ఆదివారం రాత్రి చిన్న ఘర్షణ జరిగింది. అనంతరం భాస్కర్‌ను బాలకృష్ణ తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని బెల్ట్ దుకాణంలో మద్యం తీసుకున్నాక బానోత్ సోమ్లానాయక్‌తో కలిసి వెళ్లి మద్యం తాగారు. అయితే, భాస్కర్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బాలకృష్ణ, సోమ్లానాయక్‌ను భాస్కర్ కుటుంబీకులు ప్రశ్నిస్తే తమకేం తెలియదని చెప్పారు. సోమవారం ఉదయం ఆకేరు బ్రిడ్జి కింద తల ఛిద్రమె మృతి చెందిన భాస్కర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. భాస్కర్‌కు మద్యం తాగించి బ్రిడ్జి పైనుంచి కింద పడేశారని ఆయన భార్య సుజాత అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

వరికోత యంత్రం దగ్ధం

కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెంలో సోమవారం ప్రమాదవశాత్తు వరికోత యంత్రం దగ్ధమైంది. గ్రామానికి చెందిన వాసంశెట్టి సారికకు చెందిన యంత్రాన్ని పాఠశాల సమీపంలో చెట్టు కింద నిలిపి ఉంచారు. అయితే, యంత్రం బ్యాటరీల నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో యంత్రం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనతో రూ.30 లక్షల మేర నష్టపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కాలిపోయిన వరి కోత యంత్రం

అనుమతి లేని వెంచర్లలో హద్దురాళ్లు తొలగింపు



ప్రహరీ కూల్చివేయిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: అనుమతి లేకుండా ఏర్పాటైన వెంచర్లలో ప్రహరీలతో పాటు హద్దురాళ్లను అధికారులు సోమవారం కూల్చివేశారు. అలాలే, అంతర్గత రహదారులపై కందకాలు తవ్వించారు. డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, డీటీ ప్రసాద్, ఆర్ఐ ప్రవీణ్, గ్రామ కార్యదర్శి పోలీసు బందోబస్తుతో అక్రమ వెంచర్లలో తొలగింపులు చేపట్టారు. వేపకుంట్ల – చింతగుర్తి రోడ్డులో ఐదు ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటుచేయగా అనుమతి లేదని నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కూల్చివేసినట్లు ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

● సభకు సన్నద్ధం





మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చే నెల 2న కాంగ్రెస్‌లో చేరనుండగా ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ వెనుక వైఎస్సార్ నగర్‌లో సభ నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'అటవీ' దొంగలు?



భద్రాద్రి జిల్లా అటవీశాఖ కార్యాలయం

- స్మగ్లర్లకు సహకరిస్తున్న కొందరు అటవీశాఖ సిబ్బంది
- నామమాత్రపు చర్యలతోనే ఉన్నతాధికారుల సరి
- ఇదే అదనుగా విలువైన కలపను నరికి తరలిస్తున్న అక్రమార్కులు

చుంచుపల్లి: ఒకవైపు హరితహారం కింద రాష్ట్ర ప్రభుత్వం మొక్కలను విరివిగా నాటుతూ అడవులను పెంచేలా చర్యలు తీసుకుంటుంటే మరోవైపు అడవులను నిరంతరం కాపాడాల్సిన అటవీశాఖ సిబ్బందిలో కొందరు ఇంటిదొంగలుగా మారుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులకు సహకరిస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు విలువైన టేకు, జిట్రేగి, వేప, తుమ్మ చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఏడాది కాలంగా కలప స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే కారణంతో ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం అటవీ డివిజన్ల పరిధిలో పలువురు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అయినా కలప అక్రమంగా తరలిపోతోంది. ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారని, అందుకే సిబ్బందిలో మార్పు రావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

- దుమ్ముగూడెం మండలంలో రెండేళ్ల క్రితం ఇద్దరు అటవీశాఖ సిబ్బంది మధ్య కలప రవాణాకు సంబంధించిన పంపకాల్లో తేడా రావడంతో గొడవ జరిగింది. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.
- భద్రాచలం డివిజన్ పరిధిలోని ఒక గ్రామంలో అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు గుర్తించి ఆపేశారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్షేత్రస్థాయి అటవీ ఉద్యోగిపై అధికారులు చర్యలు తీసుకున్నారు.
- గతేడాది మార్చిలో చాతకొండ రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప తరలిస్తూ కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడిన వాహనాన్ని వదిలేసేందుకు సహకరించారనే కారణంతో ఒక రేంజ్ ఆఫీసర్‌తో పాటు, ఇద్దరు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు.
- అదే ఏడాది జూన్‌లో అశ్వాపురం రేంజ్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప విషయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అధికారుల నివేదిక ఆధారంగా ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు.
- ఇల్లెందు రేంజ్ పరిధిలో కలప విక్రయం, నిధుల గోల్‌మాల్ వంటి అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ చేసిన అటవీశాఖ ఉన్నతాధికారులు గతేడాది జూలైలో ఒక రేంజర్‌తోపాటు ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, ఒక బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.
- ఇక తాజాగా అశ్వాపురం రేంజ్ ఇరవెండి పరిధి లో జామాయిల్ కలపను కొట్టి ఐటీసీ కాంట్రాక్టర్ల తో కలిసి విక్రయించారనే ఆరోపణలతో విచారణ చేపట్టి అటవీశాఖ జిల్లా అధికారులు ఒక సెక్షన్ ఆఫీసర్, ఒక బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.

ఉపేక్షించేది లేదు



స్మగ్లర్లకు సహకరించే అటవీ సిబ్బంది విషయంలో ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాం. పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరంగా కఠినమైన చర్యలకు సైతం వెనకాడేది లేదు.

– లక్ష్మణ్ రంజిత్ నాయక్, భద్రాద్రి జిల్లా అటవీశాఖాధికారి

క్లుప్తంగా...

పవన్ కులాలు, మతాలను రెచ్చగొడుతున్నారు

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతి అర్బన్: గూండాలు, వెన్నుపోటు దారులు టీడీపీ గట్టు వైపే ఉన్నారని.. తమ పార్టీలో అలాంటి నేతలు ఎవరూ లేరని ఏపీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి స్పష్టంచేశారు. అవినీతి రాజ్యం చంద్రబాబు పాలనలోనే సాగిందని.. వంగవీటి రంగాను హత్య చేయించింది ఆయనేనని ఆరోపించారు. మరోవైపు.. పవన్ పదే పదే మతాలు, కులాలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని నారాయణ స్వామి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ముద్రగడ పద్మనాభం కాపుల సంక్షేమం కోసం పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని అణగదొక్కిన ఘనత చంద్రబాబుదే. ఆ సమయంలో పవన్‌కల్యాణ్ చంద్రబాబును ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. చిరంజీవి విలువలతో కూడిన రాజకీయం చేశారు. అయితే, ఆయన తమ్ముడు పవన్‌కల్యాణ్ మాత్రం చెప్పులతో దాడిచేస్తాం.. రాళ్లతో దాడి చేస్తామంటూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. అసలు కాపులకు ఆయన చేసింది ఏమిటి? వారాహి యాత్ర ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ప్రపంచానికి 'యోగి'లను అందిస్తాం: రాందేవ్



హరిద్వార్: యోగాతో ప్రపంచానికి మరింత ఆరోగ్యాన్ని అందించేందుకు పతంజలి యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్‌లో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలకు వెళ్తారని స్వామి రాందేవ్‌బాబా అన్నారు. అన్ని హద్దులను చెరిపేసి ఇప్పుడు హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, జైన్, బుద్ధిస్టులందరూ దేశమంతటా యోగా చేస్తున్నారని తెలిపారు. యోగావల్ల దేశప్రతిష్ట ఇప్పుడు విశ్వవ్యాప్తిమయ్యిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి వెల్‌నెస్ సెంటర్‌లోని పతంజలి యోగాపీఠ్ మైదానంలో యోగా సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందేవ్.. పలువురు యోగా సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.

గూడు చెదిరి.. గుండెలవిసి!

అంతర్గాంలోని బర్మా, శ్రీలంక కాందిశీకుల దీనావస్థ

1971 నాటికి 1,000 కుటుంబాలకు ఇక్కడ పునరావాసం

1989లో దేశవ్యాప్తంగా నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ

అంతర్గాంలో 502 ఎకరాలు కేటాయించినా సొంతింటికి నోచుకోని వైనం

వెయ్యికిగాను ఇప్పుడు మిగిలింది 374 కుటుంబాలే..

తమకైనా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని వినతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ప్రాణభయంతో ఓ దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే వారిని కాందిశీకులు అంటారు. ఇలాంటి వారికి పరాయిగడ్డపై ఆశ్రయం దొరకడమే గగనం. దొరికినా వారికి పెద్దగా హక్కులు ఉండవు. కానీ బ్రిటిష్ పాలనలో పని కోసం మన దేశం నుంచి పొరుగున ఉన్న బర్మా (మయన్మార్), శ్రీలంకలకు వలసవెళ్లి అక్కడ సైనిక నియంతల హెచ్చరికలు, అంతర్యుద్ధాల కారణంగా తిరిగి భారతదేశానికి వచ్చిన కాందిశీకులది మరో కథ. వెళ్లిన కొన్నేళ్ల తర్వాత మాతృ దేశంలో బిక్కుబిక్కుమంటూ అడుగుపెట్టిన వారిని భారత్ తల్లిలా అక్కున చేర్చుకుంది. వారికి పునరావాసం కల్పించింది. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాంలో వెలసిన శరణార్థుల కాలనీలో తెలుగు వారికి కేంద్రం పునరావాసం కల్పించింది. ఇలాంటి వారందరికీ దేశవ్యాప్తంగా..ఇళ్లు, వ్యవసాయ స్థలాలు పంపిణీ చేసినా అంతర్గాంలో మాత్రం ఇంకా ప్రభుత్వ హామీలు నెరవేరలేదు. తమకు కనీసం ఇళ్లైనా మంజూరు చేయాలని వారు దీనంగా వేడుకుంటున్నారు.

అసలు ఏం జరిగింది?



లాల్ బహదూర్ శాస్త్రి-సిరిమావో బండారు నాయకేల ఇండో, శ్రీలంక ఒప్పందం 1964 (ఫైల్)

19వ శతాబ్దంలో దేశంలో విపరీతమైన కరువు వచ్చింది. ఈ కరువును ఎదుర్కొనే ప్రయత్నాలు చేయకుండా మన దేశంలోని పేదలను బర్మా, శ్రీలంక, మలేసియా తదితర దేశాల్లో తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా పంపారు. అలా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర నుంచి వేలాదిమంది బర్మాకు వలస వెళ్లారు. అక్కడ వ్యాపారాలు, పనులు చేసి రూ.కోట్లు గడించారు. అయితే 1962లో బర్మాలో సైనిక నియంత నె విన్ తిరుగుబాటుతో ప్రభుత్వం కుప్పకూలింది. పగ్గాలు చేపట్టిన నె విన్ విదేశీయులు కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లాలంటూ హుకూం జారీ చేశాడు. సైనికులు భారతీయుల ఇళ్లను దోచుకున్నారు. కనీసం మెడలో తాళిబొట్టును కూడా అనుమతించలేదు. అయితే అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆధ్వర్యంలో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు భారత సంతతి ప్రజలను దేశానికి తీసుకొచ్చి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. ఈ తరలింపు లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ హయాం వరకు పలు దఫాలుగా సాగింది. వీరితో పాటే శ్రీలంకలో జాతుల మధ్య పోరు వల్ల ఇండియాకు వచ్చిన తమిళులకూ చోటు ఇచ్చారు. ఇలా 1971 నాటికి అంతర్గాంలో దాదాపు 1,000 బర్మా, శ్రీలంక కుటుంబాలు ఆశ్రయం పొందాయి. 1989లో దేశవ్యాప్తంగా ఇలాంటి వారికి నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇదే క్రమంలో అంతర్గాం కాందిశీకులకు కేంద్రం 502 ఎకరాల భూమి కేటాయించింది. ప్రత్యేకంగా వీవింగ్ సొసైటీని ఏర్పాటు చేసి జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు తెరిచి ఉపాధి కల్పించింది. అప్పట్లో తెరిచిన మిల్లులు అధికారుల అవినీతి కారణంగా 1990వ దశకంలో మూతబడ్డాయి. కార్మికులకు కనీసం వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ కూడా రాలేదు. ఉపాధి కోల్పోవడంతో ఆకలి మరణాలు సైతం సంభవించాయి. కొన్ని కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా.. ప్రస్తుతం ఇక్కడ 374 కుటుంబాలు మాత్రమే మిగిలాయి. కానీ ఇప్పటికీ భూమి, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ మాత్రం నెరవేరలేదు.

ఇండస్ట్రియల్ పార్కులో కొలువులివ్వండి..



తమ సంక్షేమానికి కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లులు మూతబడ్డాయని, కేటాయించిన 502 ఎకరాల్లో 250 ఎకరాలైనా తమ కుటుంబాలకు కేటాయించాలని అంతర్గాంలో ఉన్న కాందిశీకులు కోరుతున్నారు. వాస్తవానికి 2009 సెప్టెంబర్ 1న ఇళ్ల స్థలాల విషయమై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని వీరు కలిశారు. దీంతో వెంటనే అందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ మరునాడే వైఎస్ హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించడంతో, ఇప్పటివరకు వీరి గోడు పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దాదాపు 100 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు కేటాయించిన భూములు కబ్జాలకు గురవుతున్నాయని, తొలుత తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి పదిగుంటల నివాస స్థలం ఇచ్చాకే, పరిశ్రమలు స్థాపించాలని శరణార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనలో బర్మా, శ్రీలంక శరణార్థుల కుటుంబాలకే తొలి ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు అప్పట్లో పునరావాసం కోసం ఏర్పాటు చేసిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతు చేసుకుందామంటే స్థానిక అధికారులు అంగీకరించడం లేదు. కనీసం ఉన్న గూడుకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పిస్తే..శరణార్థుల కుటుంబాలు తలదాచుకునేందుకు అవకాశం ఉంటుందని శ్రీలంక, బర్మా శరణార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జమ్ముల రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మార్గదర్శి'లాంటి స్కాం ఇప్పటివరకు జరగలేదు

- మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదే
- విచారణ వివరాలు తెలుసుకునే హక్కు వారికి ఉంది
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లాంటి కుంభకోణం ఇప్పటివరకు జరగలేదు, ఇకపై జరగబోదని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. 'మార్గదర్శి'కి సంబంధించిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని వెల్లడించింది. మార్గదర్శి కేసు దర్యాప్తు వివరాలను సీఐడీ అధికారులు మీడియాకు వెల్లడిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ చెరుకూరి రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రై. లిమిటెడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదేనని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం విచారణ వివరాలు తెలుసుకునే ప్రాథమిక హక్కు వారికి ఉందన్నారు. ఈ రకమైన ఓ కుంభకోణం జరగడం ఇదే తొలిసారిని చెప్పారు. ఇదే విజ్ఞప్తిపై గతంలోనూ ఇదే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అప్పుడు పిటిషనర్‌కు అనుకూలంగా ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌ను కూడా కొట్టివేయాలని కోరారు. అసలు మార్గదర్శి వేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు ఉందా అన్న అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పిటిషన్ జూలై 18న విచారణకు రానుందని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

ఐటీ ఎగుమతుల్లో బూమ్

ఏపీలో నాలుగేళ్లలో 34 శాతం పెరిగిన ఎగుమతులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత నాలుగేళ్లుగా వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పలు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తుండటంతో ఐటీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. స్టాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), వీసెజ్‌ల్లో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా 2022–23లో రాష్ట్రంలో రూ.1,649.25 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్లు ఐటీ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా రూ.972.43 కోట్ల ఎగుమతులు జరగగా వీసెజ్ కంపెనీల ద్వారా రూ.676.82 కోట్ల ఎగుమతులు జరిగాయి.

రూ.5,000 కోట్లపైనే!

2019–20లో ఏపీ నుంచి రూ.1,087.4 కోట్ల ఐటీ ఎగుమతులు నమోదు కాగా నాలుగేళ్లలో 34% పెరిగాయి. నాలుగేళ్లలో ఎస్‌టీపీఐ కంపెనీల ద్వారా ఎగుమతులు రూ.846.77 కోట్ల నుంచి రూ.972.43 కోట్లకు పెరిగితే వీసెజ్ ద్వారా ఎగుమతులు రూ.240.63 కోట్ల నుంచి 676.82 కోట్లకు చేరుకున్నాయి. ఇంకా పలు ఐటీ కంపెనీల ఆడిటింగ్ పూర్తికాలేదని, ప్రాథమిక సమాచారం మేరకు 2022–23 ఐటీ ఎగుమతుల అంచనాలను రూపొందించినట్లు ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రం నుంచి భారీగా ఎగుమతులు జరుగుతున్నా వాటి ప్రధాన కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో రాష్ట్ర పరిధిలోకి రావడం లేదని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కోసరాజు పేర్కొన్నారు.

ఆర్నెల్లలో వరుసగా..

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ కంపెనీలు విశాఖతోపాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కి ముందు రాష్ట్రంలో ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా ఇప్పుడు 372కి చేరుకోవడం గమనార్హం. కొత్తగా ఏర్పాటైన కంపెనీల ద్వారా అదనంగా 20,000కి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు 'అపిటా' గ్రూపు సీఈవో ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం: సోము వీర్రాజు

చిల్లకూరు(తిరుపతి జిల్లా)/చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో అందరూ అనుకున్నట్లు టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంలో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవూసిన్హ్ చౌహాన్‌తో కలసి ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పొత్తులతో అధికారంలోకి రాదని, అందుకే రాష్ట్రంలో టీడీపీతో ఎలాంటి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోకూడదని అనుకుంటున్నట్లు తెలిపారు. అయి తే జనసేనతో మాత్రం కలసి నడుస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారని సోమువీర్రాజు స్పష్టం చేశారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని నిర్మించారని ఆరోపించారు. బాబు పాలనలో సోమవారం పోలవరం అని కాలక్షేపం చేశారన్నారు.

జిల్లా వార్తలు

వంద శాతం హాజరు నమోదు కావాలి



హెచ్‌ఎంల సమావేశంలో సూచనలు చేస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ హెచ్‌ఎంలకు సూచించారు. హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ సమావేశం ద్వారా రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ రోనాల్డ్‌రోస్ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సమావేశం అనంతరం డేవిడ్‌రాజ్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి వంద హాజరయ్యేలా చూడాలని, పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతీ విద్యాసంస్థలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనందున తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో శ్రద్ధ వహిస్తూ అవసరమైన మందులు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, జీసీడీఓ అలివేలు మంగతాయారు, హెచ్‌ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.

సివిల్స్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్, మెయిన్స్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల్లో డిగ్రీ పాసై 31ఏళ్ల లోపు వయసుకలిగిన అభ్యర్థులు ఈ శిక్షణకు జూలై 7వ తేదీ లోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు జూలై 16న ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. అయితే, వంద మంది అభ్యర్థులను ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా, 50 మందిని నేరుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి, రవాణా కోసం నెలకు రూ.5 వేలతో పాటు రూ.5 వేల విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. గతంలో ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులను నేరుగా ఎంపిక చేస్తామని, వివరాల కోసం 08742-227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

'జల విద్యుత్'కు గ్రీన్ సిగ్నల్ వచ్చేనా ?

- సీతమ్మ సాగర్ బ్యారేజీని సందర్శించిన జెన్‌కో సీఎండీ
- రాష్ట్రంలోనే కీలకం కానున్న జల విద్యుత్ కేంద్రం





సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ ప్రభాకర్‌రావు (ఇన్‌సెట్) బీటీపీఎస్‌లో మొక్క నాటుతున్న జెన్‌కో సీఎండీ

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సోమవారం సందర్శించారు. జలవనరుల శాఖ అధికారులు మ్యాప్ ద్వారా బ్యారేజీ నిర్మాణ వివరాలను ఆయనకు తెలియజేశారు. సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ బ్యారేజీకి అనుబంధంగా 280 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బ్యారేజీ పనులు పిల్లర్ల వరకు పూర్తయినా జల విద్యుత్ కేంద్రం నిర్మాణంపై ఇంత వరకూ గ్రీన్ సిగ్నల్ రాలేదు. కాగా, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే జెన్‌కో సీఎండీ సీతమ్మ సాగర్ బ్యారేజీని సందర్శించారని సమాచారం.

రాష్ట్రంలోనే కీలకం..

సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద నిర్మించనున్న 280 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం రాష్ట్రంలోనే కీలకంగా మారనుంది. సీతమ్మ సాగర్ జల విద్యుత్ కేంద్రంలో ఏడు బల్బ్ టర్బైన్ల యూనిట్లు ఉంటాయి. ఒక్కో యూనిట్ ద్వారా 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. ఈ కేంద్రం నుంచి ఏడాదికి సుమారు 1016.88 మెగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా. రాష్ట్రంలో ఇప్పటి వరకు జల విద్యుత్ కేంద్రాలన్నీ కృష్ణా నదిపైనే ఉన్నాయి. వీటి సామర్థ్యం 2,369 మెగావాట్లు. గోదావరిపై పోచంపాడు వద్ద 36 మెగావాట్లు, నిజాంసాగర్ వద్ద 10 మెగావాట్లు, సింగూరు వద్ద 15 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి నదిపై 280 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుత్ కేంద్రం నిర్మిస్తే ఇదే కీలకం కానుంది.

బీటీపీఎస్‌ను సందర్శించిన సీఎండీ

మణుగూరు రూరల్ : జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సోమవారం మణుగూరులోని బీటీపీఎస్‌ను సందర్శించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా బీటీపీఎస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు, జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. అనంతరం బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెన్‌కో డైరెక్టర్లు టీఆర్‌కే.రావు, ఎం.సచ్చిదానందం, వెంకటరాజం, అజయ్, లక్ష్మయ్య, విద్యుత్ సౌధ సీఈ రత్నాకర్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రాంబాబు, ఏఈ నవీన్, విజిలెన్స్ అధికారులు వినోద్‌కుమార్, ముత్యంరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు రాంప్రసాద్, పార్వతి, రమేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి యూనిట్ అధికారులకు అందచేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విద్యాసంస్థల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టడమే కాక అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే, తొలి నుంచే మెరుగైన బోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఇక అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, అధికారులు తానాజీ, రమణయ్య, సురేష్‌బాబు, భాస్కరన్, మునీర్‌పాషా, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తులు

షెడ్యూల్డ్ తెగల బాలబాలికలకు నీట్ లాంగ్ టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఇచ్చే ఉచిత శిక్షణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై నీట్–2024 రాసిన గిరిజన బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వ గురుకులం వెబ్‌సైట్ ద్వారా రూ.200చెల్లించి జూలై 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'నైటింగేల్'కు కలెక్టర్ సన్మానం



సుశీలను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం అర్బన్: ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న మహిళా ఆరోగ్య కార్యకర్త తేజావత్ సుశీలను కలెక్టర్ అనుదీప్ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎర్రగుంట పీహెచ్‌సీకి చెందిన సుశీల జాతీయ స్థాయి అవార్డు స్వీకరించడం రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణమన్నారు. ఆమె స్ఫూర్తితో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మరిన్ని అవార్డులను సాధించాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఆధ్వర్యాన కూడా సుశీలను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు అధికారులు డాక్టర్ మణికంఠారెడ్డి, డాక్టర్ సుందర్, డాక్టర్ ప్రియాంక, ఫయాజ్ మొయినుద్దీన్, నాగలక్ష్మి, పూలమ్మ, మోహన్, అన్నామేరీ, విజయ్‌కుమార్, బేబీ, నాగేశ్వరరావు, శారారాణి పాల్గొన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్‌రాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే సండ్ర, మంద కృష్ణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, మంద కృష్ణ

తల్లాడ: బీఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రాం వంటి మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ సూచించారు. తల్లాడ మండలం తెలగవరంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌ల విగ్రహాలను సోమవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి దేశానికి మార్గనిర్దేశం చేసిన అంబేద్కర్ కలల సాకారానికి అందరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలను ఏర్పాటుచేసిన యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ కె.శ్రీదేవి, సర్పంచ్ తేళ్లూరి కృష్ణయ్యతో పాటు ముఫ్వా మురళీధర్‌రావు, కేతినేని చలపతిరావు, అశోక్ పాల్గొన్నారు.

కొండరెడ్లకు ఉపాధి కల్పిస్తాం

నాబార్డ్ డీడీఎం సుజిత్ కుమార్



వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం సుజిత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్ల జీవనోపాధి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని నాబార్డ్ డీడీఎం సుజీత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై దత్తత గ్రామాలైన కొండరెడ్ల గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా అశ్వారావుపేట మండలం గోగులపూడి, శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయం, దమ్మపేట మండలం పూసుకుంటల్లో పర్యటించి కొండరెడ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోగులపూడి గ్రామస్తులు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారని చెప్పగా మార్కెటింగ్‌పై ఆరా తీశారు. అలాగే, కోళ్లు, తేనెటీగల పెంపకం, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ రంగాల్లో శిక్షణ ఇస్తామని, చిరు ధాన్యాల పంటలను సాగు చేస్తే ఉత్పత్తుల తయారీకి మిషనరీ సమకూరుస్తామని సుజిత్ తెలిపారు. అనంతరం గుబ్బల మంగమ్మ ఆలయంలో వద్ద కొండరెడ్ల దుకాణాలను పరిశీలించి వ్యాపార వివరాలు తెలుసుకున్నారు. భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జి రవికుమార్, కొండరెడ్లు బాబురెడ్డి, దుర్గారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.